# నాణెం వెనుక

-కె.వాసవదత్త రమణ

కింద కారు హారను బోయ్‌మంటూ మోగింది. మంచంమీద కూర్చుని పుస్తకం చదువుకుంటున్న శ్రావ్య మేడ మీద నుంచి కిటికీ కర్టెన్ తొలగించి కిందకు చూసింది. ఎదురింటి మేడమీద ముందు తెల్లటి మారుతి కారు ఆగి వుంది. అప్పడే గేటు తెరుచుకుని ఎదురింటి ప్రభావతి వడివడిగా వచ్చి కారులో కూర్చుంటోంది.కారు కదిలి వెళ్లేవరకు చూసి కిటికీ కర్టెన్ దగ్గరగా వేసి "ఛీ...ఛీ... ఎంత బరి తెగించిన ఆడది" అంది శ్రావ్య మంచం మీద కూలబడుతూ.

"ఎవరు?" ఆశ్చర్యంగా అడిగింది పద్మజ.

"ఇంకెవరు... అదే ఆ ఎదురింటావిడ ప్రభావతి. రోజు ఎవరో ఒకరు కారు పంపుతారు. చక్కగా సింగారించుకుని ఏ సిగ్గు లేకుండా అర్ధరాత్రిళ్లు పోతుంది. తెల్లవారి గుట్టు చప్పడు కాకుండా ఇంటికి చేరుతుంది. ఛీ..ఛీ... ఆమెను చూస్తుంటే నాకు ఒళ్లు కంపరంగా ఉంది. నిజానికి ఆడజాతికి చీడపురుగులు ఇలాంటివాళ్లే" ఆవేశంగా అంది శ్రావ్య.

విషయం అర్థమై "అబ్బ... శ్రావ్యా ఏంటా అర్థంపర్థంలేని ఆవేశం. మరీ టూమచ్‌గా బిహేవ్ చేస్తున్నావు. అయినా ఆమె పర్సనల్ విషయాలు మనకెందుకు చెప్పు ఊరికే టైం వేస్ట్ తప్ప" అంది పద్మజ.

ఆమె మాటలకు కస్సుమంటు లేచింది శ్రావ్య. "అలా అంటావేమిటి పద్దు... అసలు ఇలాంటి ఆడవాళ్లని షూట్ చేసి పడేయాలి"

"చాల్లే శ్రావ్య... ఎవరి జీవితాన్ని వాళ్లకు నచ్చినట్లుగా గడుపుతారు. మనకి అలా ఒకళ్లని విమర్శించే హక్కులేదు. అయినా పాపం ఆమెకేం బాధలున్నాయో? ఎంతో దుర్భర పరిస్థితుల్లోతప్ప సరదాకి ఒళ్లు అమ్ముకునే ఆడవాళ్లు మన దేశంలో చాలా తక్కువ."

"ఏమిటి ఇంజనీరింగ్ స్టూడెంట్‌వని మర్చిపోయి సోషల్ వర్కర్‌లా మాట్లాడుతున్నావు? ఆమె తరఫున వకాల్తా బాగానే పుచ్చుకున్నావే?"

"మరయితే ఆమె గొడవ మనకెందుగానీ రేపే మనకి ఫైనల్ ఎగ్జామ్స్. మన చదువు కంటిన్యూ చేయడం బెటరేమో" పద్మజ నవ్వుతూ అంది.

శ్రావ్య ఇంకేం మాట్లాడకుండా పుస్తకం తీసింది.

***

శ్రావ్య, పద్మజ ఇద్దరూ పుట్టి పెరిగింది ఒకే ఊళ్లో. అందుకే ఇద్దరూ కలసి ఇంజనీరింగ్ ఒకే కాలేజీలో చేరారు. కానీ హాస్టల్‌లో ఫుడ్ పడకపోవడంతో అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకున్నారు. ఇంటివాళ్లు కూడా మంచివాళ్లు. పద్మజకి కొద్దిగా దూరపు బంధువులు. ఏ కూరో పచ్చడో పంపుతూ రెగ్యులర్‌గా వాళ్ల యోగక్షేమాలు కనుక్కుంటూ ఉంటారు. ఇంటి యజమాని మాటల్లో ఎదురింటి ప్రభావతి విషయాలు తెలిసాయి శ్రావ్యకి. అప్పట్నుంచీ ఆమెను చూస్తేనే ఆమెకు చాలా కోపం, అసహ్యం.

"అబ్బా...శ్రావ్యా.. ఎందుకంత ఆవేశం నీకు? అన్నీ లైట్‌గా తీసుకోవాలి" ఆమెను చల్లబరచడానికి పద్మజ ప్రయత్నించింది.

కానీ శ్రావ్య ఎంతకీ ఒప్పుకునేదికాదు కానీ శ్రావ్య ఆవేశానికే కాదు స్నేహానికి, ఉత్సాహానికీ మారుపేరు. అందుకే శ్రావ్య అంటే పద్మజకి చాలా ఇష్టం. కాలేజీలో చాలా సరదాగా అందరితో కలసిపోతుంది. అలాగే చదువులోనూ శ్రావ్యకి ఎప్పుడూ ఫస్టు మార్కులే.

***

"హాయ్ శ్రావ్య!" కాలేజీ సెక్రటరీ నందు పలకరించాడు.

"హాయ్ నందూ!" హుషారుగా అంది.

"శ్రావ్యా! రేపు లాస్ట్ డే ఆఫ్ ఎగ్జామ్స్. రేపు రాత్రికి సినిమా, డిన్నర్ అరేంజ్ చేసాం"

"అరే నందూ! కుదరదు. రేపు రాత్రికి నేను, పద్మజ ఊరు వెళ్లిపోదాం అనుకుంటున్నాము."

"నో...నో అలా అంటే ఎలా? ఎల్లుండి మార్నింగ్ వెళ్లండి."

"కుదరదు నందూ"

"నథింగ్ డూయింగ్.. ఏం పద్మ నువ్వు మాట్లాడవేం? మీరిద్దరూ రేపు మాతో జాయిన్ అవుతున్నారు సరేనా" దబాయింపుగా అన్నాడు. చివరికి ఒప్పుకోక తప్పలేదు ఇద్దరికి.

మొత్తం ఆడపిల్లలు, మగపిల్లలు కలసి అంతా ఇరవైమందిదాకా పోగయ్యారు. ఆటలతో పాటలతో ఆ సాయంత్రం అంతా ఎంజాయ్ చేసారు.

డిన్నర్ పూర్తయ్యేటప్పటికి రాత్రి పదకొండు దాటింది. ఎవరికి వారు దొరికిన ఆటో ఎక్కేసి 'బై' చెబుతూ వెళ్లిపోయారు.

"అబ్బా... శ్రావ్య కబుర్లలో పడి ఇంకా లేట్ చేస్తున్నావు? మిగతా వాళ్లందరూ హాస్టల్‌కు వెళుతున్నారు. కానీ మన రూటు వేరే" విసుక్కుంది పద్మజ.

"డోంట్‌వర్రీ పద్మా. నేనూ వినోద్ మిమ్మల్ని ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాం" నందూ అన్నాడు.

"వద్దులే నందూ...శ్రావ్య, మనం ఈ రాత్రికి హాస్టల్‌లో ఉండిపోదాం. పొద్దునే మన రూంకి వెళ్దాం" పద్మజ వారింపుగా అంది.

"అబ్బ... పద్మా! వాళ్లు డ్రాప్ చేస్తామంటున్నారుకదా. రూంకే వెళ్లిపోదాం. రేపు పొద్దున్నే ఫస్ట్ బస్‌కి ఎక్కేస్తే హాయిగా లంచ్ టైమ్‌కి మన ఇంటికి వెళ్లిపోదాం" శ్రావ్య అభ్యంతరపెట్టింది.

పద్మజకి ఇష్టంలేకపోయినా ఇంకేం తర్కించలేదు. మౌనంగా వినోద్ బైక్‌మీద ఎక్కి కూర్చుంది.

"ఛలో శ్రావ్య" నందూ హుషారుగా

అన్నాడు బైక్ స్టార్ట్ చేసి. కొంచం దూరం వెళ్లేటప్పటికి నిర్మానుష్యమైన రోడ్డు, చీకటి రాత్రి. బైక్‌మీద స్పీడుగా వెడుతుంటే శ్రావ్యకి 'హాస్టల్‌కి వెళ్లి పోయి ఉండాల్సిందేమో' అనిపించింది.

"నందూ! కొంచెం నెమ్మదిగా డ్రైవ్ చేయి" ఎగిరిపోతున్న చున్నీని గట్టిగా అదిమిపెడుతూ అంది.

అతను గట్టిగా నవ్వుతూ "శ్రావ్యా! అసలు స్పీడ్ ఇది కానే కాదు"

"నందూ! ప్లీజ్ నాకు భయమేస్తోంది."

"డేరింగ్ గర్ల్‌వి నీకు భయమా?"

"అదేమిటి... ఈవైపుకి తిప్పావు. ఇది మరీ కంకర రోడ్డు, మెయిన్‌రోడ్డు నుంచే వెళదాం"

"అరే... ఏమిటా కంగారు? శ్రావ్యా...నామీద నీ అభిప్రాయం ఏమిటి?" సడెన్‌గా అడిగాడతను.

"ఏముంది? యూ ఆర్ మై ఫ్రెండ్" అంది.



"అంతేనా శ్రావ్యా... ఇంకేం లేదా?' అతని మాటల్లో డిసప్పాయింట్ మెంట్. "అంటే?" ఆశ్చర్యంగా అంది.

"నా మనసులో మాట చెప్పనా?" వెనక్కి తిరిగి చూస్తూ అన్నాడు. అతని మాటలకు ఉలిక్కిపడుతూ "ఏమిటి?" అంది తడబాటుగా.

"ఐ లైక్ యూ... ఐ లవ్ యూ" ఆమె కళ్లల్లోకి చూస్తూ అన్నాడు.

"సారీ నందూ.. ఐయామ్ ఆల్రెడీ రిజర్వుడు మా బావకి" లేని చిరునవ్వును పెదాలమీదకు తెచ్చుకుంటూ అంది.

"ఓహ్... ఇట్స్ మై బాడ్‌లక్" నిరాశగా అన్నాడు. "శ్రావ్యా... నాకే హోప్ లేదా?" మళ్లీ అతనే అన్నాడు.

"నందూ! మా బావ అమెరికా నుంచి రాగానే మా పెళ్లి" గబగబా అంది. ఆ చీకట్లో అతని ప్రపోజల్ ఆమెని టెన్షన్ పెడుతోంది.


నిముషం మౌనం తరువాత "ఇక వెళదామా" అంది.

"నాకైతే నిన్ను వదిలి వెళ్లాలనిపించడంలేదు శ్రావ్యా... ఇన్నాళ్లుగా



## ఆల్ ది బెస్ట్

కన్నడ దర్శకుడు ప్రేమ్‌ని పెళ్లాడక ముందు వరకూ తెలుగు చిత్రాల్లో గ్లామరస్ హీరోయిన్‌గా జనాల్లో పాపులారిటీ సంపాదించుకున్న రక్షితకి ఇప్పుడు తన కొడుకు 'సూర్య'నే లోకం అంటోంది. 'నిజంగా పిల్లలంటే తల్లిదండ్రులు ఎందుకంతగా ఇదైపోతారో నాకిప్పుడు అర్థం అవుతోంది. మా బాబు సూర్యని క్షణం విడిచి వుండలేకపోతున్నాను. మావారు ప్రేమ్ కూడా వాడిని వదలి వుండలేకపోతున్నారు' అంటూ తెగ సంబరపడిపోతోంది. అన్నట్టు రక్షిత ఇప్పుడు భర్త దర్శకత్వంలో సినిమాలు తీస్తూ నిర్మాతగా మారుతోందిట. ఆల్ ద బెస్ట్ రక్షితా!




నువ్వు మీ బావ విషయం నాతో చెప్పకుండా నన్ను చాలా మోసం చేసావు" అతని మాటల్లో వింత ధ్వని.

"నందూ! ప్లీజ్ ఫర్‌గెట్ ఇట్, మనం మంచి స్నేహితుల్లా విడిపోదాం పద" చిరాగ్గా అంది. విసురుగా బైక్ స్టార్ట్ చేసాడతను.

కాసేపటికి అతని బైక్ స్పీడ్‌కి ఆమెకి భయంతో గడ్డకట్టుకుపోతున్నట్లు అనిపించింది. గుండె దడగా అనిపించింది ఆమెకు.

"నందూ! మళ్లీరూటు మార్చావు. ఎందుకిలా?"

"శ్రావ్యా... నీతో ఇంకా కాసేపు ఉండాలనిపిస్తోంది. ఇంక మళ్లీ మనం కలవం. ఇవాళ నీతో గడిపే లాస్ట్‌డే 'మనం విడిపోతాం' అన్న మాట తలచుకోవడానికే నాకు చాలా బాధగా ఉంది" అతనుచాలా అప్‌సెట్ అన్నాడు.

"నందూ! పిచ్చిగా మాట్లాడకు. ఇంత రాత్రివేళ ఇలా రోడ్డుమీద తిరగడం? మరీ టూ మచ్.. పద నన్ను అపార్ట్‌మెంట్ దగ్గర డ్రాప్ చేయి"

"శ్రావ్య.... కాసేపు నీతో గడపాలని ఉంది. నా రూంకి వెళదామా"

'నందూ! బైక్ ఆపు" కోపంగా అంది. అతను ఏం మాట్లాడలేదు.

అతను కొద్దిగా స్లో చేసి "శ్రావ్యా... జస్ట్ ఫర్ ఫన్ అంతే" అన్నాడు.

ఆమె ఇంకేం ఆలోచించలేదు. ఠక్కున కిందకు దూకేసింది. నేలమీద పడడంవల్ల చేతులు, కాళ్లు చీరుకుపోయి మంట పెడుతున్నా లెక్క చేయకుండా గబగబా మెయిన్‌రోడ్డువైపుకి పరుగు తీసింది.

"ఏయ్ శ్రావ్యా... ఏంటి అలా దూకేసావు? దెబ్బలేమైనా తగిలాయా? ఓకే పద నీ రూం దగ్గరే దింపుతాలే" వెనుక నుంచి వచ్చి ఆమె చేయి గట్టిగా పట్టుకుంటూ అన్నాడు నందు. అతను చేయి పట్టుకోవడంతో ఒక్క క్షణం ఆమె మెదడంతా స్తంభించిపోయింది.

"నో... నువ్వేం డ్రాప్ చేయనక్కర్లేదు. గెట్‌లాస్ట్... మళ్లీ నీ ముఖం నాకు ఎప్పుడూ చూపించకు" కోపంతో వణికిపోతూ గట్టిగా అరిచింది.

అతను ఒక్క ఉదుటున కింద పడిపోయాడు. అంతే ఇక వెనక్కి కూడా తిరిగి చూడకుండా జింకలా పరుగెట్టింది. దూరంగా మెయిన్ రోడ్డుమీద కారు వస్తున్నట్లు కనిపించగానే శ్రావ్యకి ప్రాణం తిరిగి వచ్చినట్లయింది.

"స్టాప్...స్టాప్" చేతులు గట్టిగా ఊపింది కారుకి అడ్డంగా పరుగెడుతూ. కారు ఆగగానే "ప్లీజ్ హెల్ప్ మీ. నేను ట్రబుల్‌లో ఉన్నాను. నన్ను కొంచెం సెంటర్‌వరకు డ్రాప్ చేయండి" కళ్లల్లో నీళ్లు తిరుగుతుండగా అంది కారు డోరు హ్యాండిల్ గట్టిగా పట్టుకుని. ఇంతలో డోరు తెరుచుకుని దిగుతున్న మనిషిని చూడగానే ఆమె కళ్లు భయంతో వెడల్పయ్యాయి. ఆమె ఎదురింటి ప్రభావతి. పక్కన ఇంకోతను బాగా తాగినట్టున్నాడు "వ్వాట్" ముద్దగా అంటున్నాడు. 'పొయ్యిలోంచి లేచి పెనంలోకి పడ్డానా?' ఆయాసంతో రొప్పుతున్న శ్రావ్యకి ఇక నోట మాట రాలేదు.

కారు ఆగి ఉండడం, తనవైపు చూపిస్తూ శ్రావ్య కారులో వున్నవాళ్లకి ఏదో చెబుతూ ఉండడం దూరం నుంచి చూస్తున్న నందుకి ఏం చేయాలో అర్థం కాలేదు.

"ఏమ్మా... ఏమైంది?" ఆమె శ్రావ్యని దగ్గరకు తీసుకుంటూ అందామె.

అంతలో అప్పుడే ఆమె శ్రావ్యని గుర్తుపట్టి ఆశ్చర్యపోతూ "అరె నువ్వా మా ఎదురింట్లో ఉండే అమ్మాయివి కదూ... రా...కారెక్కు. ఏమండీ... మీరు ముందుకెళ్లి కూర్చోండి. ఆ అమ్మాయి నాతో వెనుక కూర్చుంటుంది" అంది. మొద్దుబారిపోయిన మెదడులో జరుగుతున్న పరిణామాలను ప్రేక్షకురాలిగా చూస్తుండిపోయింది శ్రావ్య. కారెక్కి ఓ మూలకు ఒదిగి కూర్చుంది. ముందు గొయ్యి వెనుక నుయ్యిలా ఉంది ఆమె పరిస్థితి.

"ఏమ్మా... నీ పేరేమిటి?"

"శ్రావ్య"

"శ్రావ్యా... చదువుకున్న అమ్మాయివి. ఇంత అర్ధరాత్రివేళ ఒంటరిగా

ఇలా అబ్బాయితో బయట తిరగవచ్చా? ఎంత ప్రమాదం తప్పింది?'' మందలింపుగా అంది. రోజూ ఆమెను అసహ్యించుకునే తను ఈవాళ ఆమె ముందు అసహ్యకరమైన పరిస్థితిలో దొరికిపోయింది.

"పోన్లే...జరిగిందేమో జరిగిపోయింది. ఎక్కువగా ఆ విషయం గురించి ఆలోచించకు. అలాగే ఇవాళ జరిగిన విషయం గురించి ఎవరికీ చెప్పకు. అందరూ నిన్నే తప్పుపడతారు. ఆడదెప్పుడూ తన జాగ్రత్తలో తను ఉండాలి. యుగయుగాలుగా జరుగుతున్నది అదే. ఎన్ని తరాలైనా అంతే. ఎటువంటి మార్పూ రాదు'' నిట్టూరుస్తూ అంది.

శ్రావ్య మనసులో నెమ్మదిగా భయం మాయమై ఆశ్చర్యం చోటు చేసుకుంది. కొంచెం తేరుకుని జరిగినదంతా క్లుప్తంగా చెప్పిందామెకు.

"పోన్లే నువ్వు లేచిన వేళ బాగుంది. లేకపోతే ఈ అర్ధరాత్రి ఎలా ఇంటికి చేరేదానివో? మంచి జ్ఞాపకాలతో మీ ఊరు వెళ్లి హాయిగా పెళ్లి చేసుకో. నీ జీవితంలోని ఈ పీడకలని ఇక్కడికిక్కడే మర్చిపో''

కారు ఇంటి దగ్గర ఆగగానే "మీ ఋణం ఎప్పటికీ తీర్చుకోలేను'' ఆమెకు రెండు చేతులూ జోడిస్తూ కృతజ్ఞతగా అంది.

"వద్దమ్మా... నాకంత అర్హతలేదు. నిన్ను రక్షించే అవకాశం ఆ దేవుడు నాకు ఇచ్చాడు. కానీ అదే నా విషయంలో ఇలాగే జరిగినప్పుడు దేవుడు నాకు అన్యాయం చేసాడు. తన కళ్లెదురుగుండా జరుగుతున్న ఘోరాన్ని ఆపలేని నా చేతకాని మొగుడు నాకు విడాకులిచ్చి మళ్లీ పెద్ద మగాడిలా ఇంకో పెళ్లి చేసుకున్నాడు. కన్న పాపానికి నా ఇద్దరాడపిల్లల ముఖాన్ని చూసి చావలేక నేను చేయని పాపానికి నన్ను సమాజం కుళ్లబొడుస్తుంటే భరించలేక నరకయాతన అనుభవించాను. నా పిల్లలిద్దరికీ చదువుకోసం అంటూ నా నీడ కూడా వాళ్లమీద పడకుండా నా నుంచి దూరంగా వేరే ఊళ్లో వదిలేసి వచ్చి ఇక్కడ జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాను. చివరికి నన్ను సమాజం వెలివేస్తే. నా బతుకుతెరువుకోసం ఇది తప్పలేదు'' అందామె వణుకుతున్న కంఠంతో. ఆమె జీవిత వ్యధ విని చలించిపోతూ అలాగే చాలాసేపు నిలబడిపోయింది. కారు కదిలి వెళ్లిపోయింది.

'ఎంత ఘోరమైన ప్రమాదం తప్పిపోయింది?' అనుకుంటూ గబగబా సెంట్రల్ లాక్ తాళాలు తీసుకుని నిద్రపోతున్న పద్మజ పక్కన పడుకుంది. అలసిన ఆమెకి క్షణంలో నిద్ర పట్టింది.

***

"శ్రావ్యా! లే బస్సు టైమైపోతోంది'' పద్మజ రెడీ అయిపోయి శ్రావ్యని లేపింది. బద్ధకంగా లేచింది. రాత్రి జరిగిన సంఘటనలన్నీ వరుసగా గుర్తుకు రాగానే మనస్సంతా ఒక్కసారిగా కలతబారింది.

"రాత్రి మరీ అంత లేటయిందేమిటి? చూసి చూసి లాక్ వేసుకుని పడుకున్నాను. నందు బైక్‌గానీ ట్రబులిచ్చిందా?'' అంది పద్మజ.

"ఔను'' క్లుప్తంగా అనేసి మంచం దిగి బాత్రూంలోకి దూరింది శ్రావ్య.

'రాత్రివేళ ఒక మగాడితో వెళ్లడం తప్పే. పద్మజ చెప్పినట్లు హాస్టల్‌లో పడుకోవాల్సింది. చాలా పొరపాటు చేసాను. నందు మనస్సులో ఇంత దురుద్దేశం ఉందని గమనించలేకపోయాను. అంత రాత్రివేళ అలా ఒంటరిగా వెళ్లడంతో అతనికి అవకాశం ఇచ్చినట్లయింది. నిజంగా ఎంత గండం తప్పింది. లేకపోతే ఈపాటికి...' చిగురుటాకులా వణికిపోయింది శ్రావ్య ఆ ఊహకే. సామానంతా సర్దుకుని ఇంటివాళ్లకు ఇల్లు అప్పజెప్పి బయటకు వస్తుంటే అప్పుడే కారు దిగి ప్రభావతి లోపలకు వెళుతోంది.

"ఏయ్ శ్రావ్యా... నీ ఫ్రెండ్. నైట్ డ్యూటీ అయిపోయినట్టుంది'' కన్ను గీటుతూ అంది పద్మజ.

"ఛ...అలా అనకు పద్మ'' అంది శ్రావ్య.

ఆశ్చర్యంగా ఆమె వంక చూసింది పద్మజ.

"పద్మా! మనమెప్పుడూ మనకి ఎదురుగా కనిపించేదాన్ని చూస్తాం, దాన్నే నమ్ముతాం. అదే ప్రచారం చేస్తాం. మనం ఎప్పుడు నాణెం ముందు వైపే చూస్తాం. అంతేగానీ నాణెం వెనుక ఉండే చీకటిని గుర్తించం. ఆ చీకటి బాధల్ని సానుభూతితో పరిశీలించం. కనీసం చేయూతని అందించం సరి కదా మన నోటికి వచ్చినట్లు విమర్శిస్తాం. అసలు నాకనిపిస్తుంది మంచి చెడు మధ్య ఉన్న గీత చాలా చిన్నదని. మనమే మనకి ఎదుటివాళ్లల్లో ఉన్న బంధాన్ని బట్టి 'చెడు'గా, దాన్ని మరీ పెద్దదిగా భూతద్దంలో చూపించడమే లేకపోతే ఎవరికీ తెలియకూడదని 'మంచి'గా చిన్న చుక్కలాగా దాన్ని దాచేయడానికి ప్రయత్నమో చేస్తాం. పద్మా! మనుష్యులు ఎప్పుడూ చెడ్డ వాళ్లు కాదు, కానీ పరిస్థితులే ఎప్పుడూ చెడ్డవి. అదిప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను'' శ్రావ్య మనసులో ప్రభావతికి నమస్కరించుకుంటూ అంది.

★



## గుర్తింపులేని గిన్నిస్ హీరో

రైల్వే ఉద్యోగి 34 ఏళ్ల మల్లా శివా గత రెండేళ్ళుగా మినియేచర్ కళాత్మకమైన మోడల్సు తయారు చేస్తూ అనేకసార్లు గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాడు. ఈ మార్చిలో ప్రపంచంలో అతి చిన్న చెస్ బోర్డు తయారు చేసి గిన్నిస్ రికార్డు స్థాపించాడు. చత్తీస్‌ఘడ్‌లో పనిచేస్తున్న ఇతన్ని పై అధికారులు ఆర్థికంగా ప్రోత్సహిస్తామని, మినిస్ట్రీకి రికమెండ్ చేస్తామని ఉత్తిత్తి మాటలు చెపుతున్నట్టుగా ఉందేకానీ ఇంతవరకు కార్యరూపంలో ఏదీ జరగలేదు. ఇటీవల 60 మి.మీటర్ల కైవారంతో మినియేచర్ గ్లోబ్‌ని తయారు చేసి మరోసారి గిన్నిస్ రికార్డుకెక్కనున్నాడు. ప్రపంచం గుర్తిస్తున్నా ఇంటి వారు గుర్తించకపోవటం శోచనీయం!

-తటవర్తి

